క్లుప్తంగా

అరుణాచలానికి ప్రత్యేక బస్సులు


డీఎం శ్రీనివాసులు

కావలి : కార్తీక పౌర్ణమి సందర్భంగా కావలి నుంచి అరుణాచలానికి ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేస్తున్నట్లు ఆర్టీసీ కావలి డిపో మేనేజర్ రాపూరు శ్రీనివాసులు సోమవారం తెలిపారు. ఈ బస్సులు నవంబర్ 14న ఉదయం కావలిలో బయలుదేరి సాయంత్రం అరుణాచలం చేరుతాయని, గిరి ప్రదక్షిణ అనంతరం 15వ తేదీ ఉదయం అరుణాచలంలో బయలుదేరి సాయంత్రానికి కావలికి తిరిగి వస్తాయని వివరించారు. టికెట్ ధర రూ.1,400లు అని, భక్తులు ముందుగా రిజర్వేషన్ చేయించుకోవాలని కోరారు. ఇతర వివరాలకు 99660 09395 (అసిస్టెంట్ మేనేజర్), 94939 13989 (ట్రాఫిక్ సూపరింటెండెంట్) నంబర్లను సంప్రదించాలన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

వరికుంటపాడు : ఫ్యామిలీ డాక్టర్ వైద్యసేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మండల వైద్యాధికారి ఆయేషా కోరారు. మండలంలోని ఎర్రంరెడ్డిపల్లె గ్రామంలో ఆమె సోమవారం ఫ్యామిలీ డాక్టర్ వైద్యసేవలు అందించారు. 27 మంది రోగులను పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు. గ్రామస్తులకు పలు ఆరోగ్య సూచనలు చేశారు.

- చేజర్ల : మండలంలోని తూర్పుఖమ్మంపాడు ఆరోగ్య ఉపకేంద్రంలో 104 ద్వారా జరిగిన వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. చేజర్ల పీహెచ్‌సీ డాక్టర్ సింధు పాల్గొని, 55 మంది రోగులను పరీక్షించి మందులు అందజేశారు. సీహెచ్ఓ చంద్రయ్య, ఏఎన్ఎం మస్తానమ్మ పాల్గొన్నారు.

చిన్నారికి అభినందన



కావలి : పట్టణానికి చెందిన ఆటో డ్రైవర్ సురేంద్ర కుమార్తె గంగపట్నం లిఖిత సౌతిండియా స్థాయి కూచిపూడి నృత్య పోటీలకు ఎంపిక కావడం పట్ల పలువురు సోమవారం చిన్నారిని అభినందించారు. స్థానిక తుఫాన్‌నగర్‌లోని సంయుక్త నృత్య కళా నిలయంలో బ్యాంక్ ఆఫ్ ఇండియా విశ్రాంత చీఫ్ మేనేజర్ ఎం.చంద్రశేఖర్, విశ్రాంత లెక్చరర్ ఎంవీఎస్ ప్రసాదరావు అభినందన సభ ఏర్పాటు చేసి లిఖితను సన్మానించారు. ఈ సందర్భంగా లిఖిత మాట్లాడుతూ తన నాట్య గురువు కాశీ విశ్వనాథ్ ప్రోత్సాహంతోనే విజయం సాధించానని తెలిపారు.

బాధితురాలికి పరామర్శ


బాలిక తల్లితో మాట్లాడుతున్న రఘు, సుదర్శన్

ఆత్మకూరు : మాయమాటలకు మోసపోయి ఆత్మహత్యాయత్నానికి పాల్పడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న దళిత బాలికను జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ మాజీ సభ్యులు కొప్పాల రఘు, శేషం సుదర్శన్ సోమవారం పరామర్శించారు. పట్టణంలోని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో బాలికతో మాట్లాడిన అనంతరం తల్లితో మాట్లాడారు. నిందితుడిని కఠినంగా శిక్షించాలని, ప్రభుత్వపరంగా బాలిక ఉన్నత చదువుల కోసం ఆర్థిక సాయం అందజేయాలని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు.

బాణసంచా గోదాముల్లో తనిఖీ

కావలి : రూరల్ మండలం కొత్తపల్లి గ్రామంలోని బాణసంచా గోదామును కావలి రూరల్ సీఐ జి.రాజేశ్వరరావు సోమవారం తనిఖీ చేశారు. ప్రమాదం జరిగితే తీసుకోవాల్సిన చర్యలపై సూచనలు చేశారు.

నిబంధనలు పాటించాలి

ఉదయగిరి : బాణసంచా విక్రయదారులు తప్పక నిబంధనలు పాటించాలని సీఐ వెంకట్రావు, ఎస్సై ఇంద్రసేనారెడ్డి తెలిపారు. ఉదయగిరిలోని నాలుగు లైసెన్స్‌డ్ బాణసంచా గోదాములతో పాటు ఓ తయారీ యూనిట్‌ను సోమవారం పరిశీలించారు. నిబంధనలు పాటించకుంటే చర్యలు తప్పవన్నారు.

మూడు వేల పశువులకు నట్టల నివారణ మందు

వరికుంటపాడు : వరికుంటపాడు మండలంలోని పెద్దిరెడ్డిపల్లి, వరికుంటపాడు, పశువైద్యశాలల పరిధిలో సోమవారం నాటికి మూడు వేల పశువులకు నట్టల నివారణ మందు వేసినట్లు మండల పశువైద్యాధికారి రాఘవేంద్ర శర్మ తెలిపారు. పెద్దిరెడ్డిపల్లిలో జరిగిన నట్టల నివారణ కార్యక్రమాన్ని ఆయన సోమవారం పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు.

అర్బన్ మార్కెట్ ఏర్పాటు

ఆత్మకూరు : పొదుపు మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు మెప్మా ఆధ్వర్యంలో అర్బన్ మార్కెట్‌లు నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ వెంకట రమణమ్మ అన్నారు. పట్టణంలోని పాత ప్రభుత్వ ఆస్పత్రి ప్రాంగణంలో మెప్మా టీఎంసీ మాధవి ఆధ్వర్యంలో అర్బన్ మార్కెట్‌ను సోమవారం ఏర్పాటు చేశారు. రెండు రోజుల పాటు నిర్వహించే మార్కెట్‌లో పొదుపు మహిళలు తయారు చేసిన పచ్చళ్లు, ఊరగాయలు, అల్లికల బుట్టలు తదితర వాటితో పాటు తక్కువ ధరకే డ్రస్ మెటీరియల్స్‌ను విక్రయిస్తున్నట్లు తెలిపారు. మెప్మా ఆర్‌పీలు సుష్మ, విజయలక్ష్మి, రమణమ్మ, బేగం, వైస్ చైర్మన్ షేక్ సర్దార్ తదితరులు పాల్గొన్నారు.

సాగునీటి పారుదలకు దారేదీ..?

కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యానికి రైతులు బలైపోతున్నారు. రబీ సీజన్ ప్రారంభమవుతున్నా సాగునీటి కాలువలపై ప్రజాప్రతినిధులు, అధికారులు దృష్టి సారించడం లేదు. ఫలితంగా కాలువలు పిచ్చిమొక్కలు, పూడికతో నిండిపోయి అధ్వానంగా మారింది. ప్రస్తుత పరిస్థితుల్లో నీటి విడుదల జరిగినా అవి పారే దారేదీ..? అంటూ రైతులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, నాయకులు దీనిపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

- పిచ్చిమొక్కలతో కావలి కాలువ
- అధ్వానంగా గండిపాళెం ప్రాజెక్ట్ కాలువలు


పిచ్చిమొక్కలు, పూడికతో నిండిన కావలి కాలువ

ఉదయగిరి : సంగం బ్యారేజీ నుంచి సుమారు 65 కి.మీ పొడవు ఉండే కావలి కాలువ ప్రస్తుతం పిచ్చిమొక్కలు, పూడికతో నిండిపోయింది. బ్యారేజీ నుంచి నీరొదిలినా చెరువులకు చేరడం కష్టంగా మారింది. పూడికతీత పనులు చేపట్టాలని పలుమార్లు రైతులు కోరినా కూటమి ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఉదయగిరి నియోజకవర్గ పరిధిలోని కావలి కాలువలో పూడికతీత తీశారు. ప్రస్తుతం భారీ వర్షాలు కురిసినా పనులు చేసే పరిస్థితి లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. కావలి కాలువ కింద 1.25 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. 52 చెరువులతో పాటు 18 మేజర్, మైనర్ కాలువలున్నాయి. సంగం బ్యారేజీ నుంచి మొదలయ్యే ప్రధాన కాలువ పూడిక, పిచ్చిమొక్కలతో నిండిపోయింది. దీంతో కావలి పట్టణ వాసులకు నీరందించే సమ్మర్ స్టోరేజీ ట్యాంకు, చినక్రాక బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు నీరు చేరడం గగనంగా మారింది. అంతేకాక బ్రాహ్మణక్రాక, కొత్తపాళెం, హనుమకొండపాళెం మేజర్ కాలువ గేట్లు తుప్పుపట్టి నీరంతా వృథాగా పోతోందని రైతులు ఆవేదన చెందుతున్నారు.

గండిపాళెం ప్రాజెక్ట్‌పై వివక్ష

ఉదయగిరి మెట్టప్రాంత వరప్రసాదిని గండిపాళెం రిజర్వాయర్ పరిధిలో 16 వేల ఎకరాల ఆయకట్టు ఉంది. ఎడమ, కుడి కాలువలు పూడిక, ముళ్లపొదలతో నిండిపోయాయి. ఐదో నంబర్ కాలువ అధ్వానంగా ఉంది. ప్రధాన కాలువల నుంచి డిస్ట్రిబ్యూటరీ కాలువలకు నీరు వదిలే గేట్లు తుప్పుపట్టి మరమ్మతులకు గురై ఉన్నాయి. దీంతో ప్రధాన కాలువలకు నీరు వదిలితే నీరంతా వృథాగా పోతుంది. ప్రాజెక్టుకు సంబంధించిన నాలుగు ప్రధాన గేట్లకు మరమ్మతులు చేపట్టాలి. ప్రాజెక్ట్ కట్ట లోతట్టు ప్రాంతంలో ముళ్లచెట్లు పెరిగి కొంత మేర ఇబ్బందిగా ఉంది. ప్రస్తుతం ప్రాజెక్టుకు 12 అడుగుల మేర నీరు చేరింది. మెట్టపైర్లకు నీరు వదిలినా కాలువల పరిస్థితి అధ్వానంగా ఉండడంతో రైతుల చెంతకు నీరు చేరే పరిస్థితి లేదు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం వెంటనే మరమ్మతుల కోసం నిధులు కేటాయించాల్సి ఉంది.

ప్రతిపాదనలు పంపాం



గండిపాళెం రిజర్వాయర్ పరిధిలో కాలువల మరమ్మతులు, పూడిక, ముళ్లచెట్ల తొలగింపు కోసం రూ.52 లక్షలతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరైన వెంటనే పనులు చేపడుతాం. గేట్లు మరమ్మతుల కోసం రూ.18 లక్షలు నిధులు మంజూరయ్యాయి. త్వరలో టెండర్లు పిలిచి పనులు చేపడుతాం. కావలి కాలువ పూడికతీత, గేట్ల మరమ్మతులు, జీపు ట్రాక్ పనులు చేపట్టేందుకు రూ.6 కోట్లకు ప్రతిపాదనలు పంపాం.

– చంద్రమౌళి, డీఈ, ఇరిగేషన్

పట్టించుకోండి సారూ..


ఆత్మకూరు: చెరువు తూము కాలువ పరిస్థితి

ఆత్మకూరు : ఆత్మకూరు మున్సిపల్ పరిధిలో ఉన్న పెద్దిరెడ్డి కాలువ, పంట కాలువల్లో పూడికతీత చేయకపోవడంతో సాగునీరు సజావుగా సాగడం కష్టమని రైతులు అంటున్నారు. అదే క్రమంలో మండలంలోని బట్టేపాడు కాలువ, నువ్వూరుపాడు తూము కాలువలు దుస్థితిలో ఉన్నాయి. సంగం మండలంలోని దువ్వూరు కాలువలో సాగునీరు సాగని పరిస్థితి నెలకొంది. మక్తాపురం కాలువ దుస్థితిలో ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఏఎస్‌పేట మండలంలోని అనుమసముద్రం కాలువ పూడికకు నోచుకోక సాగునీరు సాగని పరిస్థితిలో ఉంది. చేజర్ల మండలంలోని గొల్లపల్లి, ఓబులాయపల్లి గ్రామాల పొలాలకు నీరు సరఫరా చేసే కాలువ సైతం పూడికతీయక దుస్థితిలో ఉంది. ఈ విషయమై ఇరిగేషన్ ఈఈ వెంకటేశ్వరరావును సంప్రదించగా మంత్రి ఆనం ఆదేశాల మేరకు డివిజన్ పరిధిలో 53 ప్రధాన కాలువలకు పూడికతీత, మరమ్మతుల పనులకు రూ.4.52 కోట్లతో ప్రతిపాదనలు పంపినట్లు పేర్కొన్నారు. త్వరలో పనులు మొదలుపెడుతామని తెలియజేశారు.


చేజర్ల మండలంలో సాగునీటి కాలువ దుస్థితి

భూ ఆక్రమణదారులపై చర్యలు

సాక్షి ఎఫెక్ట్..

ఉదయగిరి : మండలంలోని చొడేపల్లి, కృష్ణంపల్లి, ఆర్లపడియ తదితర రెవెన్యూ గ్రామాల పరిధిలో ప్రభుత్వ భూములను ఆక్రమించిన వ్యక్తులను గుర్తించి కేసులు నమోదు చేస్తామని తహసీల్దార్ సుభద్ర తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆమె సోమవారం విలేకరులతో మాట్లాడారు. ఆక్రమిత భూముల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అధికారులు సర్వే చేస్తున్నారని, రెండ్రోజుల్లో సమగ్ర నివేదిక వస్తుందన్నారు. దీని ఆధారంగా పోలీసులకు ఫిర్యాదు చేసి కేసులు నమోదు చేస్తామన్నారు.

పొదుపు సభ్యులతో సమావేశం

జలదంకి : స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో మండల సమాఖ్య సభ్యులు, లీడర్లతో ఐకేపీ ఏపీఎం నాగమణి సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న రుణాలను పొదుపు మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సీసీలు రవి, పద్మ, మోహన్ రావు, కొండలరావు పాల్గొన్నారు.

ఆస్పత్రుల్లో రక్షణ కల్పించాలి

ఆత్మకూరు : ప్రభుత్వ ఆస్పత్రుల్లో డాక్టర్లు, సిబ్బందికి రక్షణ కల్పించేందుకు పోలీసులు సిద్ధంగా ఉండాలని ఆర్డీఓ పావని అన్నారు. కేంద్ర హోంశాఖ ఆదేశాల మేరకు సోమవారం రాత్రి తన చాంబర్‌లో ఆమె ఆత్మకూరు డీఎస్పీ కె.వేణుగోపాల్, సీఐ గంగాధర్, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శేషారత్నంలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కోల్‌కతా ఘటన నేపథ్యంలో కేంద్ర హోంశాఖ పలు విధి విధానాలను ఖరారు చేసిందన్నారు. డాక్టర్లు, సిబ్బందికి రక్షణ కల్పించేలా పోలీసులు విధులు నిర్వహించాలన్నారు.

మద్యం దుకాణాల తొలగింపునకు విజ్ఞప్తి


ఆర్డీఓకు వినతిపత్రం అందజేస్తున్న కమిటీ ప్రతినిధులు

కావలి : పట్టణంలో జనావాసాలు, బస్టాండ్, విద్యాలయాలు, దుకాణాల సమీపంలో ఏర్పాటు చేసిన ప్రైవేట్ మద్యం దుకాణాలను తక్షణమే తొలగించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ ప్రజాసంఘాల పోరాట కమిటీ వారు కావలి ఆర్డీఓ ఎం.వంశీకృష్ణకు విజ్ఞప్తి చేశారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వారు సోమవారం వినత్రిపత్రం అందజేశారు. పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఏర్పాటు చేసిన మద్యం దుకాణం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, మందుబాబులు మహిళల పట్ల అనుచితంగా వ్యవహరిస్తున్నారని వారు పేర్కొన్నారు. అలాగే తుమ్మలపెంట రోడ్డు సెంటర్‌లో బ్యాంకులు, వాణిజ్య సంస్థలు పక్కన, ఇతర ప్రాంతాల్లో జనావాసాల వద్ద ఏర్పాటు చేసిన మద్యం దుకాణాలను ఇతర ప్రాంతాలకు మార్చాలని కోరారు. అదేవిధంగా దీపావళికి బాణసంచా దుకాణాలను క్రీడా మైదానంలోనే ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు ఎన్.రవీంద్ర, సి.శారద, టి.లక్ష్మి, డి.మురళి, కె.అరవిందబాబు, కె.సూర్య, ఎస్.మల్లి పాల్గొన్నారు.

జయప్రదం చేద్దాం


ఆత్మకూరులో మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు


దుత్తలూరు : ఇంటింటి ప్రచారం చేస్తున్న నాయకులు

ఆత్మకూరు : ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ పర్యటనను జయప్రదం చేద్దామని ఆ పార్టీ నాయకుడు గొల్లపల్లి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. పట్టణంలోని రాఘవేంద్ర కల్యాణ మండపంలో సోమవారం సమావేశం నిర్వహించారు. నవంబరు 3వ తేదీన ఆయన జిల్లాలో పర్యటించనున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణకు పూర్తి ఆమోదం తెలిపి అమలు చేయాలని, అనంతసాగరం ఉద్యోగాల భర్తీ ప్రక్రియ చేపట్టాలని డిమాండ్ చేశారు. నాయకులు జి.వెంకటేశ్వర్లు, పందిటి అంబేడ్కర్, తాటిపర్తి లక్ష్మయ్య, జి.లక్ష్మమ్మ, ఎస్.అంకయ్య, ఆనంద్, శ్రీనివాసులు, రమణమ్మ పాల్గొన్నారు.

- దుత్తలూరు : ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణమాదిగ పర్యటనను జయప్రదం చేయాలని ఎంఎస్పీ మండల ఇన్‌చార్జి గొల్లపల్లి మోహన్‌రావు కోరారు. దుత్తలూరు ఏఏ కాలనీలో ఇంటింటికీ వెళ్లి ప్రచారం నిర్వహించారు. ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు వేలాదిగా తరలివచ్చే విధంగా కృషిచేయాలన్నారు. సింహాద్రి, ఎద్దనపూడి రమణయ్య, బర్రె అర్జున్, కొసిన పోగు రవి పాల్గొన్నారు.

పోలీస్ వ్యవస్థపై అవగాహన

వరికుంటపాడు : స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఓపెన్ హౌస్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు పోలీస్ వ్యవస్థపై ఎస్సై రఘునాథ్ సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎఫ్ఐఆర్‌లు ఎందుకు నమోదు చేస్తారు, ప్రమాదాల సమయంలో పోలీసులకు ఎలా సమాచారం ఇవ్వాలి అనే అంశాలపై వివరించారు. హెడ్ కానిస్టేబుల్ రమణయ్య ఉన్నారు.

- కొండాపురం : పోలీస్ సంస్మరణ దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా స్థానిక ఆదర్శ పాఠశాల విద్యార్థులకు పోలీస్ ఓపెన్‌హౌస్ కార్యక్రమంపై ఎస్సై ఎం.వెంకట్రావు సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా క్రైమ్ రికార్డులు, వీవీహెచ్ సెట్, లాకప్ గురించి వివరించారు.

క్రికెట్ టోర్నీ ప్రారంభం

కావలి : పట్టణంలోని పుల్లారెడ్డి నగర్‌లో క్రికెట్ టోర్నీని ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువకులు క్రీడల్లో ఉత్సాహంగా పాల్గొనాలని తెలిపారు.

వేలం కేంద్రంలో సదస్సు

కలిగిరి : కలిగిరిలోని పొగాకు వేలం కేంద్రంలో ప్రత్యామ్నాయ పంటలు, పంటల మార్పిడి, పంటలసాగుపై రైతులకు సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. వేలం నిర్వహణాధికారి వి.మహేష్‌కుమార్ మాట్లాడుతూ పొగాకు రైతులు యాజమాన్య పద్ధతులతో సాగు చేస్తే లాభాలు పొందవచ్చన్నారు.

దుకాణదారులతో సమావేశం

సంగం : స్థానిక రెవెన్యూ కార్యాలయం, పోలీస్‌స్టేషన్‌లో బాణసంచా దుకాణాల యజమానులతో ఇన్‌చార్జి తహసీల్దార్ సంధ్యా, ఎస్సై రాజేష్ సోమవారం సమావేశం నిర్వహించారు. యజమానులు తప్పనిసరిగా లైసెన్సులు పొందాలని సూచించారు.

4న మాలల గర్జన

అల్లూరు : మండలంలోని నార్త్‌మోపూర్ గ్రామం మాలపల్లిలో ఎస్సీ వర్గీకరణ వ్యతిరేఖ పోరాట సమితి ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. నవంబర్ 4న అల్లూరు అంబేడ్కర్ విగ్రహం వద్ద జరిగే మాలల గర్జనకు అందరూ తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు. అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సాల్మాన్‌రాజ్, నాయకులు కోమ్మి ఆశీర్వాదం, సుధాకర్, మాల్యాద్రి పాల్గొన్నారు.

బస్సు ఢీకొని వ్యక్తికి గాయాలు

కావలి : పట్టణంలోని ట్రంక్‌రోడ్డులో సోమవారం నడిచి వెళ్తున్న వ్యక్తిని ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు.. పట్టణంలోని రామ్మూర్తిపేటకు చెందిన మాధవరావు ట్రంక్‌రోడ్డులోని మండల పరిషత్ కార్యాలయం వద్ద నడిచి వెళ్తున్నారు. ఈ క్రమంలో ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో తలకు గాయాలయ్యాయి. స్థానికులు గుర్తించి క్షతగాత్రుడిని ఆస్పత్రికి తరలించారు.

మెగా రక్తదాన శిబిరం నేడు

ఉదయగిరి : పోలీస్ సంస్మరణ దినోత్సవం సందర్భంగా మంగళవారం ఉదయగిరిలో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ఎస్సై కర్నాటి ఇంద్రసేనారెడ్డి సోమవారం తెలిపారు. విద్యార్థులు, యువకులు, గ్రామస్తులు పాల్గొనాలని కోరారు.

సమస్యలపై వినతి


అర్జీని పరిశీలిస్తున్న తహసీల్దార్

ఉదయగిరి : స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ప్రజలు తమ సమస్యలపై సోమవారం తహసీల్దార్ సుభద్రకు వినతులు సమర్పించారు. జి.చెర్లోపల్లిలో రంగమ్మ పేరంటాలమ్మ ఆలయ స్థలాన్ని గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు ఆక్రమించి విక్రయించే ప్రయత్నం చేస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. దీనిపై నివేదిక ఇవ్వాలని వీఆర్వోను తహసీల్దార్ ఆదేశించారు.

- పడుకుంటపాడు : స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో తహసీల్దార్ హేమంత్‌కుమార్ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. దీనిని సంబంధిత శాఖ అధికారులు సత్వరమే పరిష్కరించాలన్నారు.
- వింజమూరు(ఉదయగిరి) : మండలంలోని చింతలపాళెం ఎస్సీకాలనీలో సీసీరోడ్డు, మురుగు కాలువలు లేక ఇబ్బందులు పడుతున్నట్లు కాలనీ వాసులు సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు.

హైలెవల్ కెనాల్‌ను పూర్తి చేయాలి

మర్రిపాడు : సోమశిల హైలెవల్ కెనాల్‌ను సత్వరమే పూర్తి చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ అన్నారు. మర్రిపాడు మండల కేంద్రంలోని పుచ్చలపల్లి సుందరయ్య భవన్‌లో తొమ్మిదో మండల మహాసభ మహ్మద్‌గౌస్, పోలిరెడ్డి అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వక్ఫ్‌బోర్డు భూముల వ్యవహారంలో మైనారిటీలకు సీపీఎం అండగా ఉంటుందన్నారు. అనంతరం మండల కమిటీని ఎన్నుకున్నారు. మండల కార్యదర్శిగా రహమతుల్లా, సభ్యులుగా రత్నయ్య, శ్రీనివాసులు, సుధాకర్, గంగినేని తిరుపతి, వి.వీరయ్య, ఖాజావలీ, శ్యామలమ్మ, చిన్న వెంగయ్యలను ఎన్నుకున్నారు.

కారు అదుపుతప్పి ఏఓకు గాయాలు

జలదంకి : కారు అదుపుతప్పడంతో జలదంకి మండల వ్యవసాయాధికారి(ఏఓ)గా పనిచేస్తున్న బి.శైలజకు గాయాలైన ఘటన సోమవారం జరిగింది. జలదంకి పోలీసుల కథనం మేరకు.. జలదంకిలోని కార్యాలయం నుంచి విధుల నిమిత్తం ఒక్కరే కారులో బ్రాహ్మణక్రాక వైపు బయలుదేరారు. తొమ్మిదో మైలు సమీపంలో కారు అదుపుతప్పి ఓ డెయిరీ ప్రహరీ గోడను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారు నడుపుతున్న శైలజ తలకు గాయాలయ్యాయి. ఆమెను చికిత్స నిమిత్తం కావలిలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. ఎస్సై లతీఫున్నీసా పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మున్సిపల్ కార్మికుల ధర్నా


కావలి : ధర్నా చేస్తున్న కార్మికులు



ఆత్మకూరు : ధర్నా చేస్తున్న మున్సిపల్ కార్మికులు

కావలి : తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ, కార్మిక సంఘం ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు సోమవారం ధర్నా చేశారు. స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి నుంచి ట్రంక్‌రోడ్డులో ప్రదర్శనగా మున్సిపల్ కార్యాలయానికి చేరుకున్నారు. కమిషనర్ శ్రావణ్‌కుమార్‌కు అర్జీని అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ నేత పసుపులేటి పెంచలయ్య మాట్లాడుతూ కార్మికులకు పనిముట్లు, రక్షణ పరికరాలు ఇవ్వడం లేదన్నారు. ముఖ్యంగా యూనిఫాం, కొబ్బరినూనెలు, సబ్బులు ఇవ్వడం లేదని తెలిపారు. రోజువారీ కార్మికులకు ప్రతినెలా జీతం చెల్లించడం లేదన్నారు. వెంటనే వారి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

- ఆత్మకూరు : సీఐటీయూ కమిటీ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు సోమవారం కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా కార్యదర్శి పెంచలనరసయ్య, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శివప్రసాద్ మాట్లాడారు. సమ్మె కాలంలో 16 రోజుల జీతం చెల్లించాలని, 2017–18 సంవత్సరాలకు సంబంధించి ఒక్కో కార్మికుడికి రూ.24 వేల బకాయిలు ఉన్నాయని, వాటిని చెల్లించాలని కోరారు. అనంతరం కమిషనర్ గంగాప్రసాద్‌కు వినతి పత్రం అందజేశారు. కేవీపీఎస్ డివిజన్ కార్యదర్శి ఎ.నాగయ్య, మున్సిపల్ వర్కర్స్ నాయకులు గురవయ్య, శీనయ్య, రామయ్య, కమలమ్మ, గోవిందరాజు, వెంకాయమ్మ, శీనయ్య పాల్గొన్నారు.

నిబంధనలు పాటించకుంటే చర్యలు


కావలి : రికార్డులు తనిఖీ చేస్తున్న ఏఓ లలిత

కావలి : విత్తనాల విక్రయదారులు నిబంధనలు పాటించకుంటే చర్యలు తప్పవని ఏఓ లలిత అన్నారు. పట్టణంలోని విత్తన దుకాణాలను ఆమె సోమవారం తనిఖీ చేశారు. రిజిస్టర్లు, బిల్ బుక్‌లు, విత్తనాల కొనుగోలుకు సంబంధించిన ఇన్‌వాయిస్‌లను పరిశీలించారు. పలు వరి విత్తన రకాలను సేకరించి పరీక్షలకు పంపారు. దుకాణదారులకు పలు సూచనలు చేశారు.

- అనుమసముద్రంపేట : మండలంలోని హసనాపురం, ఏఎస్‌పేటలోని ఎరువులు, పురుగు మందులు, విత్తన దుకాణాలను నెల్లూరు ఏడీఏ ఎన్.శ్రీనివాసరావు సోమవారం తనిఖీ చేశారు. రేట్లు, స్టాక్ వివరాలను ప్రదర్శించాలన్నారు. ఏఓలు రజనీ, కిశోర్‌బాబు ఉన్నారు.
- చేజర్ల : రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించాలని పొదలకూరు ఏడీఏ శివనాయక్ అన్నారు. మండలంలోని ఆదూరుపల్లి, చేజర్లలో ఉన్న ఎరువులు, పురుగు మందులు, విత్తనాల దుకాణాలను ఆయన సోమవారం తనిఖీ చేశారు. ఆయన వెంట ఇందుకూరుపేట ఏడీఏ రాజ్‌కుమార్, ఏఓ శేఖర్ ఉన్నారు.
- ఆత్మకూరురూరల్ : ఆత్మకూరు పట్టణంలోని పలు ఎరువులు, పురుగు మందులు, విత్తనాల రిటైల్ షాపులను ఏడీఏ శ్రీనివాస్ సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా షాపు రిజిస్టర్లు, బిల్లు పుస్తకాలు, విత్తనాల స్టాకును పరిశీలించారు. రైతులు ప్రభుత్వ అనుమతి పొందిన డీలర్ల వద్ద మాత్రమే విత్తనాలను కొనుగోలు చేయాలన్నారు. మండల ఏఓ కిశోర్‌బాబు ఉన్నారు.

గ్యాస్ సబ్సిడీని బ్యాంకుల్లో జమ చేయొద్దు

కావలి : ప్రభుత్వం అందించే గ్యాస్ సబ్సిడీని బ్యాంక్‌లలో జమ చేయవద్దు అని దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్.మల్లి డిమాండ్ చేశారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం ఆర్డీఓ వంశీకృష్ణకు వినతి పత్రం ఇచ్చారు. ప్రభుత్వం ఉచిత గ్యాస్ సిలిండర్లకు సంబంధించి నగదును బ్యాంక్‌లలో జమ చేస్తే పేదలు నష్టపోతారని, దీనిని సచివాలయ ఉద్యోగుల ద్వారా ఇవ్వాలని కోరారు.

ముందర పొట్టెమ్మకు పూజలు



కావలి : రూరల్ మండలం అన్నగారిపాళెం గ్రామంలో కొలువైన ముందర పొట్టెమ్మ తల్లి తిరునాళ్లలో భాగంగా సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందర పొట్టెమ్మతో పాటు గంగమ్మ తల్లికి కూడా విశేష పూజలతో పాటు మహాచండీయాగం, శివ పార్వతుల కల్యాణం, కుంభాభిషేకం జరిగాయి.

దుర్గం అభివృద్ధిపై పరిశీలన



ఉదయగిరి : ఉదయగిరి దుర్గం అభివృద్ధిపై ఆర్అండ్‌బీ, పురావస్తు అధికారులు సోమవారం పరిశీలించారు. ముందుగా పట్టణంలోని ఉన్న చారిత్రక కట్టడాలు, కొలనులను సందర్శించారు. పూర్తిస్థాయిలో అభివృద్ధి పనులపై నివేదికను తయారు చేస్తున్నట్లు ఆర్అండ్‌బీ డీఈ మదన్‌కుమార్ తెలిపారు. ఆర్అండ్‌బీ ఏఈ మస్తాన్, స్థానిక టీడీపీ నేతలు మన్నేటి వెంకటరెడ్డి, బయ్యన్న పాల్గొన్నారు.

భగవద్గీతపై ప్రచారం

సంగం : మండలంలోని తరుణవాయి, ఉడ్‌హౌస్‌పేట, సిద్ధిపురం గ్రామాల్లో త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇందూ జ్ఞానవేదిక సభ్యులు దీపావళి ప్రాముఖ్యత గురించి వివరించారు. కార్యక్రమంలో సభ్యులు జి.పెంచలనరసయ్య, బి.కృష్ణయ్య, ఎం.కొండయ్య, ఈ.పెంచలయ్య, ఈ.శేషాద్రి, పి.మధు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాల పరిశీలన

మర్రిపాడు : మండలంలోని బూదవాడ పంచాయతీ ఏపిలగుంటలో గృహ నిర్మాణాలను ఎంపీడీఓ నాగేశ్వరప్రసాద్, హౌసింగ్ ఏఈ రవికుమార్‌తో కలిసి సోమవారం పరిశీలించారు. ప్రభుత్వం త్వరగా బిల్లులను మంజూరు చేస్తోందని, గృహ నిర్మాణాలను త్వరగా పూర్తి చేసుకోవాలని సూచించారు.